27-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మిమ్మల్ని అందరినీ తిరిగి తీసుకువెళ్ళేందుకు కాలుడికే కాలుడు వచ్చారు, అందుకే స్మృతి ద్వారా వికర్మల భారాన్ని సమాప్తం చేయండి, మీ దేహము నుండి మోహాన్ని తొలగించండి"

ప్రశ్న:- భక్తుల ఏ పిలుపును తండ్రి విన్నప్పుడు భక్తులు సంతోషపడేందుకు బదులుగా దుఃఖితులుగా అవ్వడం మొదలుపెడతారు?

జవాబు:- భక్తులకు ఎప్పుడైతే దుఃఖము కలుగుతుందో అప్పుడు - ఓ భగవంతుడా, నన్ను ఈ దుఃఖపు ప్రపంచం నుండి తీసుకువెళ్ళండి, ఈ పతిత ప్రపంచములో నా అవసరం లేదు అని అంటారు, కానీ ఎప్పుడైతే తండ్రి పిలుపును విని తీసుకువెళ్ళేందుకు వస్తారో, అప్పుడు ఏడుస్తారు. డాక్టర్ కు ఏమని చెప్తారంటే - ఎటువంటి మందును ఇవ్వండి అంటే దాని ద్వారా మేము ఆరోగ్యవంతులుగా అవ్వాలి.

పాట:- దూరదేశంలో నివసించేవారు... (దూర్ దేశ్ కా రెహ్నే వాలా...)

ఓం శాంతి. దూరదేశంలో తండ్రి కూడా ఉంటారు మరియు పిల్లలైన మీరు కూడా ఉంటారు. ఇప్పుడు ఈ తండ్రి ఇక్కడకు ఎందుకు వచ్చారు? ఓ భగవంతుడా రండి, వచ్చి మమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళండి అని తండ్రిని ఎందుకు స్మృతి చేస్తారు? మా ఇల్లు అయిన ముక్తిధామానికి తీసుకువెళ్ళండి అని ఆత్మ అంటుంది. ఈ విధంగా కాలుడికే కాలుడిని పిలిచినట్లు అవుతుంది. భక్తి మార్గంలో ఈ విధంగా - మమ్మల్ని ఈ పతిత ప్రపంచపు సంబంధాల నుండి విడిపించి తమతో పాటు తీసుకువెళ్ళండి, మేము ఇక్కడ ఉండవలసిన అవసరం లేదు అని ఎవరిని పిలుస్తున్నామో అర్థం చేసుకోరు మరియు ఎవరి ఆత్మ అయినా శరీరం వదిలినప్పుడు ఎంతగా దుఃఖితులుగా అవుతారు, ఏడుస్తారు-రోదిస్తారు. ఒకవైపేమో - బాబా, మీరు వచ్చి మమ్మల్ని ఇక్కడి నుండి తీసుకువెళ్ళండి, ఈ శరీరం నుండి ముక్తులుగా చేయండి అని పిలుస్తారు. మళ్ళీ ఎప్పుడైతే ముక్తులుగా చేస్తారో అప్పుడు ఏడుస్తారు-ఆర్తనాదాలు చేస్తారు. భక్తి మార్గంలో పిలుస్తారు కానీ అర్థం చేసుకోరు. సావిత్రి సత్యవంతుని కథ ఉంది కదా. వారు ఒక్కరి ఆత్మనే తీసుకువెళ్తూ ఉన్నారు, కానీ సావిత్రి తీసుకువెళ్ళనివ్వలేదు. మనుష్యులు శరీరాన్ని వదిలేటప్పుడు శరీరం పట్ల మోహం ఉన్న కారణంగా ఆత్మ వదలాలి అని అనుకోదు. డాక్టర్ కు ఏమని చెప్తారంటే - ఎటువంటి మందును ఇవ్వండి అంటే దాని ద్వారా మేము ఆరోగ్యవంతులుగా అవ్వాలి. నేను శరీరాన్ని వదలాలని అనుకోవడం లేదు. అలాగే మళ్ళీ - భగవంతుడా రండి, వచ్చి మమ్మల్ని తమతో పాటు తీసుకువెళ్ళండి అని అంటారు. ఇది ఆశ్చర్యకరమైన విషయము కదా. ఇప్పుడు మీరు సంతోషంగా వెళ్తారు. మనుష్యులకు ప్రపంచంలోని మిత్ర-సంబంధీకులు మొదలైనవారి పట్ల మోహం ఉంది. ఇప్పుడు బాబా అడుగుతారు - మిమ్మల్ని మిత్ర-సంబంధీకులు మొదలైనవారి నుండి విడిపించాలా? తీసుకుని అయితే వెళ్తాను కానీ మీరు ఈ సంబంధీకుల స్మృతిని విడిచిపెట్టండి. అంత్యకాలములో ఒకవేళ పిల్లలు మొదలైనవారిని స్మృతి చేస్తే మళ్ళీ అటువంటి జన్మనే లభిస్తుంది. బాబా అంటారు - నేను ఆత్మలైన మిమ్మల్ని ఈ శరీరము నుండి వేరు చేసి తీసుకువెళ్తాను, మళ్ళీ మీకు మిత్ర-సంబంధీకులు మొదలైనవారు గుర్తుకురారు కదా? చివరిలో ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. పునర్జన్మలలో మళ్ళీ ఇక్కడకు రాకూడదు, అందుకే దేహ సహితంగా అందరినీ మర్చిపోతూ ఉండండి. తండ్రినైన నన్నొక్కరినే స్మృతి చేయండి. ఎప్పటివరకైతే మీరు పవిత్రంగా అవ్వరో అప్పటివరకూ నేను మిమ్మల్ని తీసుకువెళ్ళలేను. ఇప్పుడు నేను ఆత్మలైన మిమ్మల్ని తీసుకువెళ్ళేందుకు వచ్చాను, కానీ మీపై వికర్మల భారం ఎంతగానో ఉంది. ఈ విధంగా వారు ఆత్మలతో మాట్లాడుతున్నారు. తండ్రి పరంధామం నుండి పరాయి దేశంలోకి వచ్చారు. తమ దేశమైన స్వర్గాన్ని ఏదైతే స్థాపన చేస్తారో, అందులోకైతే వారు వచ్చేది లేదు. ఇక్కడ మీరు దుఃఖితులుగా అయి పిలుస్తారు, నేనైతే ఒకే సమయంలో వచ్చి ఆత్మలందరినీ తిరిగి తీసుకువెళ్ళాలి. సంతోషంగానైనా వెళ్ళండి, అయిష్టంగానైనా వెళ్ళండి. వెళ్ళడమైతే తప్పకుండా వెళ్ళాలి. అనంతమైన తండ్రి కాలుడికే కాలుడు, ఆత్మలను తిరిగి తీసుకువెళ్తారు. అనగా మనుష్యాత్మలందరి వినాశనాన్ని చేసేందుకు వస్తారు. స్త్రీ-పురుషులు ఉంటారు, స్త్రీ యొక్క పతి మరణించినట్లయితే ఎంతగా ఏడుస్తారు. ఇప్పుడు ఆమె అంటారు - నన్ను తీసుకువెళ్ళండి, నాకేమీ వద్దు. కానీ పతితులైన మిమ్మల్ని తీసుకువెళ్ళలేను, అందుకే పావనంగా తయారుచేసేందుకు వచ్చాను. ఎప్పుడైతే స్వయాన్ని అశరీరిగా భావిస్తారో అప్పుడే పావనులుగా అవుతారు. దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలనూ మర్చిపోతారు. తండ్రినైన నన్నొక్కడినే స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి. కల్పకల్పమూ యుక్తులనైతే చాలా మంచివి తెలియజేస్తాను. మీకు తెలుసు - ఈ శరీరాలన్నీ బూడిద అయిపోతాయి. హోలికను

జరుపుకున్నప్పుడు అందులోని దారం కాలదు, అలాగే ఆత్మ కూడా కాలదు. కానీ ఈ అడవికి నిప్పు అంటుకునేది ఉంది. శరీరాలన్నీ కాలి బూడిదగా అయిపోతాయి మరియు ఆత్మ శుద్ధంగా అవుతుంది.

ఆత్మలు శుద్ధంగా అవ్వడానికి నిరంతరం దేహీ-అభిమానులుగా అయ్యే పురుషార్థం చేయాలి. దేహము ఉన్నప్పటికీ స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రితో యోగాన్ని జోడించాలి. ఏ విధంగా సన్యాసులు బ్రహ్మము లేక తత్వముతో యోగాన్ని జోడిస్తారు, వారంటారు - మేము తత్వంలో లీనమైపోతాము అని. తత్వముతో బుద్ధియోగము జోడించబడుతుంది. అలాగని శరీరాన్ని వదిలేస్తారు అని కాదు. తత్వముతో లేక బ్రహ్మముతో మేము యోగాన్ని జోడిస్తూ-జోడిస్తూ బ్రహ్మములో లీనమైపోతాము అని వారు భావిస్తారు, అందుకే మనం వారిని బ్రహ్మ జ్ఞానులు, తత్వ జ్ఞానులు అని అంటాము. వారికి తత్వ జ్ఞానము ఉంది. ఆత్మలమైన మనం తత్వంలో ఉంటామని మీకు జ్ఞానము ఉంది. మేము ఆ తత్వంలో లీనమైపోతాము అని వారు భావిస్తారు. మేము అక్కడికి వెళ్ళి ఉంటాము అని అన్నా, అది కూడా కరెక్టే. ఆత్మ లీనమైతే అవ్వదు. నీటిబుడగ ఉదాహరణను ఇస్తారు కానీ అది తప్పు. జ్యోతిలో లీనమయ్యే విషయమే లేదు. అవినాశీ ఆత్మలో మొత్తం పాత్ర అంతా నిండి ఉంది, అది ఎప్పటికీ వినాశనమవ్వదు. సన్యాసులు వికారాలను సన్యసిస్తారు, కానీ తిరిగి అయితే ఎవరూ వెళ్ళరు, ఇక్కడే పునర్జన్మలు తీసుకుంటూ ఉంటారు. వృద్ధి జరుగుతూ ఉంటుంది. అందరూ సతో, రజో, తమోలను దాటవలసిందే. డ్రామాలో ఇదంతా నిశ్చితమై ఉంది. ఇప్పుడు వ్యాధులు కూడా ఎన్ని రకాలవి వెలువడ్డాయో చూడండి, మొదట ఇన్ని ఉండేవి కావు. డ్రామాలో ఇదంతా నిశ్చితమై ఉంది. ఆత్మలందరినీ తిరిగి తీసుకువెళ్ళేందుకే బాబా వచ్చారని పిల్లలైన మీకు తెలుసు. పిల్లలు అంటారు - బాబా, మమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళండి. ముక్తి-జీవన్ముక్తి అయితే అందరికీ లభించనున్నది. కానీ అందరూ సత్యయుగములోకైతే రాలేరు. ఎవరెవరు ఏయే సమయాలలో వస్తారో, అదే సమయంలో అదే ధర్మంలోకి మళ్ళీ రావలసి ఉంటుంది. మీకు తెలుసు - ఫలానా-ఫలానా ధర్మాలు, ఫలానా సమయానికి వస్తాయి. బాబా కూడా కల్పపూర్వము వలె వచ్చారు, ఇంతమంది ఆత్మలందరినీ తిరిగి తీసుకువెళ్తారు. ఈ ధరణికి ఎంత ఎరువు లభించనున్నది. కొత్త ప్రపంచానికి కూడా ఎరువు కావాలి కదా. కావున మనుష్యులు, జంతువులు మొదలైనవన్నీ అంతమై ఎరువుగా అవుతాయి, మళ్ళీ సత్యయుగంలో ఎంత మంచి ఫలాలను ఇస్తుంది, అది పిల్లలైన మీరు సాక్షాత్కారంలో కూడా చూసారు.

బాబా కాలుడికే కాలుడు అని పిల్లలైన మీకు తెలుసు. అందరూ అంటారు - బాబా, మేము సంతోషంగా మీతో పాటు వస్తాము, మమ్మల్ని తీసుకువెళ్ళండి. మాకు ఇక్కడ చాలా దుఃఖము ఉంది. ఇది ఉన్నదే దుఃఖమిచ్చేటువంటి ప్రపంచము. దుఃఖధామములో ఒకరికొకరు దుఃఖాన్ని ఇచ్చుకుంటూ ఉంటారు. అపారమైన దుఃఖము ఉంది, ఇప్పుడు మిమ్మల్ని సుఖములోకి తీసుకువెళ్ళేందుకు వచ్చాను. ఇప్పుడు ఒక్కరిని స్మృతి చేసినట్లయితే వారసత్వాన్ని పొందగలుగుతారు. లేకపోతే రాజ్య వారసత్వాన్ని పూర్తిగా పొందలేరు, అప్పుడిక ప్రజలలోకి వెళ్ళిపోతారు. తండ్రి వచ్చి రాజ్య సుఖాన్ని ఇస్తారు, ఇతర ఏ ధర్మ స్థాపకులూ రాజధానిని స్థాపన చేయరు. వీరైతే గుప్త వేషంలో రాజధానిని స్థాపన చేస్తున్నారు. ఎవ్వరికీ కూడా తెలియదు - సత్యయుగములో లక్ష్మీనారాయణుల రాజధాని ఎలా స్థాపన అయ్యింది? కలియుగములో అసురులు ఉన్నప్పుడు, శరీరధారులైన దేవతలు ఎక్కడి నుండి వచ్చారు? అసురులు మరియు దేవతల మధ్యన యుద్ధమైతే జరుగలేదు. యుద్ధము విషయమూ లేదు, వికారాల ఖడ్గమూ నడవదు. మరి యుద్ధం జరిగినట్లు ఎందుకు చూపిస్తారు? తికమకపడ్డారు. సృష్టి అయితే అదే, కేవలం సమయం మారుతుంది. ఇది అనంతమైన పగలు, అనంతమైన రాత్రి. సత్య-త్రేతాయుగాలను పగలు అని అంటారు, అక్కడైతే యుద్ధము జరుగదు. కానీ ఆ రాజధాని వారికి ఎలా లభించింది? కలియుగములో రాజధాని లేదు. బాబా, మీ స్థాపనా కార్యము అద్భుతమైనది! అని అంటారు. ఇంతమంది పిల్లలను సుఖవంతులుగా తయారుచేస్తారు. ఇకపోతే తమ-తమ పురుషార్థం అనుసారంగా ఉన్నత పదవిని పొందగలుగుతారు. మీకు తెలుసు - 5 వేల సంవత్సరాల తర్వాత పరమపిత పరమాత్మ వస్తారు. అయితే కొందరు ప్రభు, కొందరు గాడ్ అని అంటారు, వారు తండ్రి కదా. తండ్రి అని అంటే ఎంత బాగుంటుంది. ఈశ్వరుడు మన తండ్రి. కేవలం ప్రభు అని అనడం ద్వారా అంత ఆనందం కలుగదు. గాడ్ అని అనడంతో సర్వవ్యాపి అని భావిస్తారు. తండ్రి అని అన్నట్లయితే సర్వవ్యాపి అని అనలేరు. ఇప్పుడు ఆత్మలైన మీరు వింటున్నారు. మన బాబా వచ్చి ఉన్నారని, మనల్ని యోగం ద్వారా పవిత్రంగా తయారుచేస్తున్నారని అర్థం చేసుకుంటారు. కావున తండ్రి, శిక్షకుడు, సద్గురువును స్మృతి చేయవలసి ఉంటుంది. ఇక్కడ సమ్ముఖముగా ఉండడం వలన పిల్లలకు ఆ అనుభూతి కలుగుతుంది. నేను ఆత్మను, ఈ శరీరము ద్వారా పాత్రను అభినయిస్తాను. బాబా నన్ను తీసుకువెళ్ళేందుకు వచ్చారు. బాబాతో యోగము జోడించేందుకు నేను పురుషార్థం చేస్తాను. బాబాను స్మృతి చేస్తూ-చేస్తూ బాబా వద్దకు వెళ్ళిపోతాను. సన్యాసులు ఎవరైతే చాలా ఉత్తములుగా ఉంటారో, వారు కూడా ఇదే విధంగా

కూర్చుని-కూర్చునే శరీరాన్ని వదిలేస్తారు. ఆత్మనైన నేను వెళ్ళి బ్రహ్మాండములో లీనమైపోతాను అని వారు భావిస్తారు. అందరూ మోక్షము లేక ముక్తి కొరకే పురుషార్థం చేస్తారు ఎందుకంటే ప్రపంచంలో ఎంతో దుఃఖము ఉంది, అందుకే మోక్షమును లేక ముక్తిని కోరుకుంటారు. ప్రపంచ చక్రము తిరుగుతుందని వారికి తెలియదు. మన పాత్ర తప్పకుండా అవినాశిగానే ఉండాలి.

మీ బుద్ధి జిన్నూ వలె ఉండాలి. జిన్నుభూతం యొక్క కథను చెప్తారు కదా, జిన్నూ అంటుంది - నాకు పని ఇవ్వండి, లేకపోతే తినేస్తాను అని. అప్పుడు తనకు మెట్లు ఎక్కాలి మరియు దిగాలి అన్న పనిని ఇచ్చారు. మీకు కూడా తండ్రి అంటారు - నాతో బుద్ధియోగాన్ని జోడించండి, లేదంటే మాయా జిన్నూ మిమ్మల్ని తినేస్తుంది. మాయ జిన్నూ వంటిది, యోగము జోడించనివ్వదు. మంచి-మంచి బలశాలులను, ధైర్యవంతులను కూడా మాయ పచ్చిగా తినేస్తుంది. బాబా నేర్పించేందుకు వచ్చారని మీకు తెలుసు. వారంటారు - పిల్లలూ, ఇప్పుడు నేను సమ్ముఖంగా వచ్చాను, నన్ను ఇప్పుడు స్మృతి చేయండి, లేకపోతే మాయా జిన్నూ తినేస్తుంది. మీ కళ్యాణము కొరకే ఈ పనిని ఇవ్వడం జరుగుతుంది. మీరు విశ్వాధిపతులుగా అవుతారు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ శరీర భానాన్ని విడిచిపెట్టాలి. సన్యాసులు అనగా దేహ సహితముగా అన్నింటి యొక్క సన్యాసము. కానీ స్వయాన్ని ఆత్మగా భావించాలి. మీకు తెలుసు - జ్ఞానము మరియు యోగబలంతో బాబా మనల్ని మళ్ళీ దేవీ-దేవతలుగా తయారుచేస్తారు. రాజ్యము స్థాపనవుతుంది. ఇది రాజయోగము. ఈ విషయాలు శాస్త్రాలలో లేవు. పాండవులు అంతగా రాజయోగాన్ని నేర్చుకున్నారు, తర్వాత ఏమి జరిగింది? కేవలం పర్వతముపైకి వెళ్ళి కరిగి మరణించారా? మళ్ళీ రాజ్యము ఎలా స్థాపనయ్యింది అనేది ఎలా తెలుస్తుంది? ఇప్పుడు ఈ విషయాలను మీరు అర్థం చేసుకోగలరు. బాబా అంటారు - ఇప్పుడు నన్ను స్మృతి చేయండి మరియు ట్రస్టీలుగా అయి శ్రీమతముపై నడవండి. ప్రతి విషయంలో సలహా తీసుకుంటూ ఉండండి. పిల్లలు మొదలైనవారి వివాహము చేయవలసి వస్తుంది, వద్దు అని ఏమైనా అంటారా. ప్రతి ఒక్కరి లెక్కాచారాలు వేర్వేరుగా ఉన్నాయి. ఏయే పిల్లలు ఎలా-ఎలా ఉంటారో వారి లెక్కలను చూసి సలహా ఇవ్వడం జరుగుతుంది. వారంటారు - పిల్లలకు వివాహం చేయించాలంటే చేయండి. మీ వద్ద ధనము ఉంటే ఇల్లును కట్టుకోండి. అందులో అవరోధమేమీ లేదు. ఇల్లు మొదలైనవి నిర్మించి, పిల్లల వివాహాలు మొదలైనవి చేయించి, లెక్కలను తీర్చుకోండి.

ఎవరు మంచి పదవిని పొందగలరు అనేది ఇప్పుడు అర్థం చేసుకుంటారు. ఇది ఎంత కష్టతరమైనది. ఇందులో చాలా దూరదృష్టి కల బుద్ధి కావాలి. రాజ్యాన్ని పొందాలి - ఇది ఏమైనా తక్కువ విషయమా! పని పూర్తయ్యేలోపే, పిల్లలు మొదలైనవారి లెక్కలను తీర్చుకొని వాటి నుండి దూరమవ్వండి. ఎవరితోనైనా లెక్కాచారం ఉంది, అప్పు ఉంది అంటే మొదట దానిని తీర్చుకోండి. ఇది కూడా అర్థం చేసుకోవలసిన విషయము. కన్యలకు భారమేమీ ఉండదు. రచయిత అన్ని పనులనూ సమాప్తం చేయవలసి ఉంటుంది. అప్పుడు బాబా వారసులుగా చేసుకోగలరు. మాయ కూడా మంచి రీతిలో దెబ్బ కొడుతుంది. కానీ, బాబా అయితే చాలా మధురమైనవారు అని కూడా మీరు భావిస్తారు. అందరినీ పవిత్రంగా చేసి తిరిగి తీసుకువెళ్ళేందుకు వచ్చారు. అటువంటి తండ్రి పట్ల చాలా ప్రేమ ఉండాలి. వారు మధురమైనవారు కదా. సత్యయుగములో అపారమైన సుఖాలు ఉన్నాయి అందుకే అందరూ స్వర్గాన్ని గుర్తు చేసుకుంటారు. ఎవరైనా మరణిస్తే స్వర్గస్థులయ్యారు అని అంటారు. అది ఎంత మధురమైన పేరు! ఏదైతే గతించిపోతుందో దాని పేరు మళ్ళీ భక్తి మార్గములో ప్రసిద్ధమవుతుంది. సత్య-త్రేతాయుగాలలో ఈ విషయాలు ఉండవు. కావున బాబా జిన్నూ చేసేటువంటి పనిని ఇచ్చారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేయండి, లేకపోతే మాయా రూపీ జిన్నూ మిమ్మల్ని తినేస్తుంది. స్మృతి చేయవలసి ఉంటుంది. ఆత్మగా నిశ్చయం ఏర్పరచుకుని తండ్రిని స్మృతి చేయాలి. శరీర నిర్వహణార్థము కర్మలైతే చేయాల్సిందే. 8 గంటలు శరీర నిర్వహణ కొరకు కావాలి ఎందుకంటే మీరు కర్మయోగులు. ఆ తర్వాత మీరు పురుషార్థము చేయండి. 8 గంటలు మీ పురుషార్థము కొరకు కూడా కేటాయించండి. స్వయాన్ని ఈ విధంగా భావించండి - నేను బాబాకు చెందినవానిగా అయ్యాను. ఈ శరీరమైతే పాతది, దీని పట్ల మమకారము తొలగిపోవాలి. తొలగిపోతూ-తొలగిపోతూ, స్మృతి చేస్తూ-చేస్తూ ఒకవేళ ఎవరి పట్లనైనా మమకారము మిగిలిపోయినట్లయితే రాజ్య భాగ్యాన్ని పొందలేరు. విశ్వాధిపతులుగా అవ్వడానికి కృషి చేయాలి.

దుఃఖధామం నుండి విముక్తులుగా చేసి తీసుకువెళ్ళేందుకు బాబా వచ్చారు, అందుకే వారిని ముక్తిప్రదాత మరియు మార్గదర్శకుడు, పతితపావనుడు అని అంటారు. వారు మార్గదర్శకుడు కూడా. ఈ విధంగా అర్థం చేయించాలి - రావణ రాజ్య వినాశనము మరియు రామ రాజ్య స్థాపనను చేసేందుకు తండ్రి రావలసి ఉంటుంది. వారే శాంతి స్థాపనను చేస్తారు, ఎవరైతే వారికి సహాయకులుగా అవుతారో వారికి పీస్ ప్రైజ్ లభిస్తుంది. శాంతిని స్థాపన చేసేవారే

శాంతియుతమైన రాజ్యాన్ని ఇస్తారు. వారే అతి ప్రియమైన తండ్రి, వారు మనకు కల్పకల్పము వారసత్వాన్ని ఇస్తారు, ఎంతగా శ్రీమతంపై నడుస్తారో అంతగా శ్రేష్ఠంగా అవుతారు. మీకు తెలుసు - శ్రీ శ్రీ ద్వారా మనం శ్రీలక్ష్మి, శ్రీ నారాయణులుగా అవుతాము. 21 జన్మల కొరకు సూర్యవంశీ-చంద్రవంశీయుల రాజధాని స్థాపనవుతుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. దూరదృష్టి కలవారిగా అయి కర్మబంధనాన్ని సమాప్తం చేయాలి. ఏవైనా లెక్కాచారాలు లేక అప్పులు ఉంటే, వాటిని తొలగించుకుని తేలికగా అయి వారసులుగా అవ్వాలి.

2. కర్మయోగులుగా అయి కర్మలు కూడా చేయాలి, దానితోపాటు 8 గంటలు స్వ పురుషార్థానికి కూడా కేటాయించాలి. అందరి పట్ల ఉన్న మమకారాన్ని తప్పకుండా తొలగించాలి.

వరదానము:- ప్రవృత్తిలో ఉంటూ కూడా సమర్పితమై సేవా ధ్యాసలో ఉండే బాప్ దాదా యొక్క హృదయ సింహాసనాధికారీ భవ

ఏ పిల్లలైతే ప్రవృత్తిలో ఉంటూ కూడా సమర్పితమై ఉన్నారో, వారి సహయోగము ద్వారా సేవ అనే వృక్షము ఫలీభూతమవుతుంది. వారి సహయోగమే వృక్షానికి నీరుగా అవుతుంది. ఏ విధంగా వృక్షానికి నీరు లభించటం ద్వారా మంచి ఫలాలు వెలువడతాయో, అలా శ్రేష్ఠ సహయోగీ ఆత్మల సహయోగము ద్వారా వృక్షము ఫలీభూతమవుతుంది. ఇలా సేవా ధ్యాసలో సదా ఉండేవారు, ప్రవృత్తిలో ఉంటూ సమర్పితమై నడిచే పిల్లలు బాప్ దాదాకు హృదయ సింహాసనాధికారులుగా అవుతారు.

స్లోగన్:- అతి తక్కువ సమయంలో సంకల్పాలను మలచుకునే మరియు బ్రేక్ వేసే యుక్తిని నేర్చుకున్నట్లయితే బుద్ధి యొక్క శక్తి వ్యర్థమవ్వజాలదు.